


రామ భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు

- భారీ ఎత్తున శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు
- రేపటి నుంచి ఏప్రిల్ 12 వరకు వేడుకలు
- రూ.2.50 కోట్ల నిధుల కేటాయింపు
- 6న అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం
- సెక్టార్లలో తొలిసారిగా పొగమంచు యంత్రాలు
- ఆంధ్రజ్యోతితో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి



భద్రాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులు మెచ్చే రీతిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతుండగా ఏప్రిల్ 12 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. భద్రాచలం, పర్ణశాలల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 6న శ్రీరామనవమికి, 7న శ్రీరామ మహాపట్టాభిషేకానికి కలెక్టరు జితేష్‌వి పాటిల్ పర్యవేక్షణలో అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వాటి వివరాలు..ఈవో మాటల్లోనే..

రూ.2.50 కోట్ల బడ్జెట్

ఈసారి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు రూ.2.50 కోట్లతో బడ్జెట్ రూపొందించాం. ఇందులో సుమారు రూ1.50 కోట్లు ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనుల కోసం కేటాయించడం జరిగింది. మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపాన్ని 24సెక్టార్లుగా విభజించగా అందులో 31వేల మంది ప్రత్యక్షంగా కల్యాణం తిలకించడానికి వీలుంది.

ఈ సారి పొగమంచు సౌకర్యం

ఈసారి ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవతో భక్తుల కోసం మిథిలా స్టేడియంలోని అన్ని సెక్టార్లలో పొగమంచు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా భక్తులకు వేడి నుంచి ఉపశమనం లభించనుంది.

సౌకర్యాలు, సదుపాయాలు..

కల్యాణ మండపంలో 50 టన్నుల ఏసీ, వంద కూలర్లు, 250 ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నాం. భద్రాచలం, పర్ణశాలల్లో నాలుగు లక్షల చదరపు అడుగుల్లో చలువ పందిళ్లను వేయడం జరుగుతోంది. సెక్టార్లలోని భక్తులకు నేరుగా మజ్జిగ, తాగునీరు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో (మిగతా 6వ పేజీలో)



మైనింగ్ కళాశాల భవనం

పారిశ్రామిక నగరికి మహర్దశ

అభివృద్ధి వైపు వడివడిగా కొత్తగూడెం అడుగులు

సింగరేణికి పుట్టినిల్లుగా, పారిశ్రామిక కేంద్రంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గుర్తింపు పొందిన కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏజెన్సీ ప్రాంతంపై ఉన్న మమకారంతో అక్కడ అవసరాలు గుర్తించి పట్టుదలతో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ, కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గడిచిన ఆరునెలలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధిలో తన ముద్ర వేస్తున్నారు. మరోవైపు కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలుపుతూ నగర పాలక సంస్థ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతుండటంతో కొత్తగూడెం ముఖచిత్రం పూర్తిగా మారనుంది.

- ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు
- ఇప్పటికే పురోగతిలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు
- త్వరలోనే నగర పాలక సంస్థగా ఆవిర్భావం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ ఫలితం

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు, మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలలో యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సింగరేణితోపాటు నవభారత్, కేటీపీఎస్, ఎన్ఎండీసీ, ఐటీసీ బీపీఎల్, హెవీవాటర్ ప్రాజెక్టు వంటి భారీ, మధ్యతరహా పరిశ్రమలకు కొత్తగూడెం జిల్లా కేంద్రంగా నిలిచింది. రాష్ట్రస్థాయిలోనే పారిశ్రామిక నగరంగా కొత్తగూడెం ముందుంది. సింగరేణికి పుట్టినిల్లుగా నిజాం బ్రిటీష్ కాలంనుంచి బొగ్గు ఉత్పత్తికి కేంద్రంగా నిలిచిన కొత్తగూడెం పలు బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఒక్కొక్కటిగా ఏర్పడడంతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది.

భిన్నమైన కోర్సులు...

భవిష్యత్ పరిశోధన శాస్త్రవేత్తలకు ఈ యూనివర్సిటీ వేదిక కావడంతో పాటు తెలంగాణకే మంచి గుర్తింపు వస్తుందని, విద్య, ఉద్యోగ అవకాశాలు విద్యార్థులకు అందుతాయని (మిగతా 6వ పేజీలో)

సీఎం సానుకూల స్పందన..

కొత్తగూడెం, పాల్వంచ మధ్య కేయూ మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీని ఎంసీఏ, ఎంబీఏలను గతంలో ఏర్పాటుచేసింది వందల ఎకరాల స్థలం కలిగిన ఈ కళాశాలను రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా అభివృద్ధి చేయాలని మంత్రి తుమ్మల సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అక్కడ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామిక సంస్థలను విద్యారంగానికి అనుసంధానం చేసి విద్యార్థుల పరిశోధనలకు సైతం అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడున్న పరిశ్రమలు ఎర్త్ యూనివర్సిటీకి దోహదం చేస్తాయని, దేశంలోనే మంచి గుర్తింపు వస్తుందని ముఖ్యమంత్రికి వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు.

భద్రాద్రిలో ముగిసిన శిథిలాల తొలగింపు

- అర్ధరాత్రి రెండో మృతదేహం లభ్యం
- బాధితులకు పరిహారం చెల్లించాలంటూ రాజకీయ పార్టీల ధర్నా, నిరసన ర్యాలీ
- ఆందోళనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రేగా, సీపీఎం నాయకులు

భద్రాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో మూడు రోజులుగా సాగుతున్న బహుళ అంతస్తు శిథిలాల తొలగింపు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. జీ+5 బహుళ అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలడంతో ఈ సంఘటనలో ఇద్దరు తాపీ మేస్త్రీలు కామేశ్వరరావు, ఉపేందర్ రావు శిథిలాల కింద చిక్కుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి, తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్క్యూ (మిగతా 6వ పేజీలో)

భూములు కోల్పోయిన కుటుంబాలకు పరిహారం



భద్రాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రామాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా భూములు, ఇండ్లు కోల్పోతున్న కుటుంబాలకు శుక్రవారం భద్రాచలం ఆర్డీవో కార్యాలయంలో నష్టపరిహారం చెక్కులను ఆర్డీవో దామోదర్‌రావు అందజేశారు. 40 కుటుంబాలకు రూ.34,45,86,439 అందజేసేందుకు నిర్ణయించారు. అందులో భాగంగా తొలి రోజున 17కుటుంబాలకు చెక్కులు అందించారు. మిగతా వారికి శనివారం అందజేయనున్నారు. ఇదిలా ఉండగా, గజానికి రూ.23,200 నిర్దేశించడంతో పాటు, ఇంటి నిర్మాణ విలువ ఆధారంగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు. శనివారం అందజేసిన చెక్కుల్లో కనిష్టంగా రూ.28లక్షలు, గరిష్టంగా రూ.కోటి 80 లక్షల పరిహారం అందింది.

వైద్య, ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు

- అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీకి శ్రీకారం
- దరఖాస్తులకు గడువు ఏప్రిల్ 2

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జాతీయ ఆరోగ్యమిషన్ విభాగంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 3 సపోర్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి జోన్-4 అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బీ.కళావతిబాయి తెలిపారు. బీ.టెక్ (సీఎస్సీ ఐటీ ఈసీఈ /ఎంసీఏ) పూర్తి చేసి, 4 ఏళ్ల అనుభవం వున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు కనీస వయస్సు 18 నుంచి 44 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు.అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 1సైకియాట్రిస్ట్ పోస్ట్ భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎం.డి. (సైకియాట్రీ) లేదా సమానమైన సైకియాట్రీ డిగ్రీ కలిగి ఉండి రెండేళ్ల అనుభవం కలిగిన మల్టీ జోన్-1 అభ్యర్థులు ఈ పోస్టుకు అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఏప్రిల్ 2 సాయంత్రం 5 గంటల వరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందించాలని ఆమె కోరారు.

కోల్డ్ స్టోరేజీలకు డిమాండ్

- మిర్చికి గిట్టుబాటు ధర లేకపోవడంతో నిల్వకే రైతుల మొగ్గు
- ఇప్పటికే 90 శాతానికి పైగా నిండిన శీతల గిడ్డంగులు
- ఇదే అదనుగా కిరాయి ధర పెంచిన యాజమాన్యాలు

ఖమ్మం మార్కెట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): 'అమ్మబోతే అడవి కొనబోతే కొరివి'లా తయారైంది అన్నదాతల పరిస్థితి. ఆరుగాలం కష్టించి పండించిన మిర్చి పంటను మార్కెట్‌లో అమ్ముకుందామంటే గిట్టుబాటు ధర దక్కడం లేదు. కోల్డ్ స్టోరేజీల్లో దాచుకుందామంటే పంటకు ఈ ఏడాది ధర పెరుగుతుందో లేదో అని అనుమానాలు వెంటాడుతున్నాయి. ఏది జరిగితే అది జరుగుతుందని మిర్చి పంటను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసుకునేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఇప్పటి వరకు సుమారు 30లక్షల బస్తాలు అమ్మకానికి రాగా, జిల్లాలోని సుమారు 48 కోల్డ్ స్టోరేజీల్లో 47లక్షల బస్తాల నిల్వ సామర్థ్యానికిగాను సుమారు 40 లక్షల మిర్చి బస్తాలు నిల్వ చేశారు.

గిట్టుబాటు ధర దక్కక పోవడంతోనే..

మార్కెట్లో రోజు రోజుకూ తగ్గుతున్న మిర్చి ధరలతో విసిగి వేసారిన రైతులు కోల్డ్ స్టోరేజీలపై ఆశ పెట్టుకున్నారు. సీజన్ ప్రారంభంలో క్వింటాలు రూ.18వేల నుంచి రూ.19వేల ధర పలుకుతున్నపుడు వడివడిగా పంట అమ్ముకున్న రైతులు ప్రస్తుతం క్వింటాలు కనిష్టంగా రూ.9వేల నుంచి గరిష్టంగా రూ.12వేలు మాత్రమే దక్కుతున్నాయి. ధరలు పడిపోతున్న కారణంగా గిట్టుబాటు కావడం లేదని పంట నిల్వ కోసం శీతల గిడ్డంగుల వైపు పరిగెడుతున్నారు. రాబోయే రోజుల్లో అయినా పంటకు రేటు వస్తుందని ఆశలు పెట్టుకుంటున్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో రేటు దక్కదని వ్యాపార నిపుణులు చెబుతున్నా.. వారిలో ఉన్న కొంత ఆశతో కోల్డ్‌స్టోరేజీల్లో పంటను నిల్వ చేస్తున్నారు.



కోల్డ్ స్టోరేజీల ముందు బారులు తీరిన వాహనాలు

కాగా, నగరంలోని వ్యవసాయ మార్కెట్ పరిధితో పాటు నగర శివారులో మద్దులపల్లి మార్కెట్ పరిధిలో ఉన్న సుమారు 25కోల్డ్ స్టోరేజీలలో 23లక్షల బస్తాల కెపాసిటీ ఉండగా రైతులు ఇప్పటికే సుమారు 20లక్షల బస్తాలకు పైగా నిల్వ చేశారు. ఇక ఆయా కోల్డ్ స్టోరేజీలలో కేవలం 2 నుంచి 3 లక్షల బస్తాలకు మించి చోటు లేదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక వేళ శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిర్చికి ధర పెరగకపోతే మొదటికే మోసం వచ్చే పరిస్థితి ఉన్నా రైతుల్లో ఉన్న (మిగతా 6వ పేజీలో)



ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఖమ్మంలోని సీక్వెల్ రిసార్ట్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పలువురు ముస్లిం ప్రముఖులు, పెద్దలు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1లోగా సమస్యలు పరిష్కరించాలి..



ఖమ్మంలో మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ ఈదురు వెంకన్న

- లేకుంటే అదేరోజు సమ్మెలోకి దిగుతాం..
- కార్మికులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆర్టీసీ జేఏసీ నాయకుల అల్టిమేటం

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల హామీలో ఇచ్చిన విధంగా రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులను ఆదుకోవటంలో విఫలం చెందిందని, 15 ఏళ్ల పాటు అనేక పోరాటాలు చేసి చివరకు ఏప్రిల్ 1నుంచి సమ్మెబాటకు సిద్ధమైనట్లు ఆర్టీసీ జేఏసీ నాయకులు ప్రకటించారు. ఆర్టీసీలోని పలు ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ కేఎస్ పాల్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులకు పని వత్తిడి పెరిగి దాడులు, మరణాలు సంభవిస్తున్నాయని ఆరోపించారు. 15 నెలల పాటు అనేక పోరాటాలు చేసిన ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరించిందన్నారు.

అందుకే ఖమ్మం నుంచి సమ్మె సైరన్ మోగించేందుకు జేఏసీ సమావేశం నిర్వహించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటుగా వేతన సవరణ జరపాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని విస్తరించాలని కోరారు. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటీకరణకు ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ప్రైవేట్ ఎల్ఎంటీ ఎలక్ట్రిక్ బస్సులను రహదారులపైకి దింపి వారికే ఆర్టీసీ డిపోలను కేటాయిస్తుందని ఆక్షేపించారు.

జనవరి నుంచి అనేక సార్లు ఆర్టీసీకి సమస్యలను వివరించటం జరిగిందన్నారు. ఏప్రిల్ 1వ వరకు ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలని, ఆర్టీసీని ప్రైవేటీకరణ ఆలోచన మానుకోకుంటే ఏప్రిల్ 1న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి నిర్వహించి వెంటనే సమ్మెలోకి దిగుతామని స్పష్టం చేశారు. ఆర్టీసీలోని అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలు కలిసి రావాలని కోరారు. జేఏసీ కన్వీనర్ కత్తుల యాదయ్య, పలు ఉద్యోగ సంఘాల బాధ్యులు సుద్దాల సురేశ్, పాటి అప్పారావు, ఎల్ఆర్‌కే రావు, ఎన్వీ భద్రం, నాగరాజు, పులి రమేశ్, జీఎస్‌రావు, అరుణకుమారి పాల్గొన్నారు.

సన్నబియ్యం వచ్చేశాయ్

- 72వేల మెట్రిక్ టన్నుల నిల్వలు
- ఉగాది నుంచి పంపిణీకి ఏర్పాట్లు
- ఆంధ్రజ్యోతితో డీఎం గంటా శ్రీలత



ఫటాఫట్

ప్రశ్న: ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ అంటున్నారు...?

జవాబు: అవును. సన్నబియ్యం వచ్చేశాయి. వచ్చేనెల 1 నుంచి పేదలకు రేషన్ కార్డుల ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్ర: జిల్లాలో ఎన్ని రేషన్ దుకాణాలు ఉన్నాయి..? వివరాలు చెప్పరా..?

జ: జిల్లాలో 748 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 8 ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా దుకాణాలకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం. అక్కడి నుంచి లబ్దిదారులకు ప్రతి నెలా బియ్యాన్ని అందిస్తున్నాం.

ప్ర: సన్నబియ్యం నిల్వలు ఎంత మేర ఉన్నాయి..?

జ: జిల్లాకు సరిపడా సన్నబియ్యం నిల్వలు ఉన్నాయి. గత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా సన్నధాన్యాన్ని కొనుగోలు చేశాం. అవన్నీ మిల్లర్ల వద్ద మిల్లింగ్ చేస్తున్నాం. 72 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అందుబాటులోకి వస్తాయి. ఏడాది పాటు కొరత లేకుండా నిరాటంకంగా పంపిణీ చేస్తాం.

ప్ర: ఇప్పటి వరకు రేషన్ దుకాణాలకు సన్నబియ్యం సరఫరా ఎంత వరకు వచ్చింది..?

జ: జిల్లాలో 748 దుకాణాలకు గాను 2248 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేశాం. 229 మంది డీలర్లు 1638.985 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్ దుకాణాలకు తీసుకెళ్లారు.

ప్ర: జిల్లాకు ప్రతి నెలా ఎంత మేర అవసరం ఉంటుంది...?

జ: డీలర్ల వద్ద ఓపెనింగ్ బ్యాలెన్స్ ప్రకారం బియ్యాన్ని పంపిణీ చేస్తుంటాం. ఈ సారికి సన్నబియ్యం కాబట్టి 6వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుంది. ఇప్పటి వరకు 2248 మెట్రిక్ టన్నులు సరఫరా చేశాం. అంటే 40శాతం సరఫరా అయ్యింది. ఈనెలాఖరు నాటికి నూరుశాతం సరఫరా చేస్తాం.

ప్ర: సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారా...?

జ: ఈనెల 30న ఉగాది పండుగ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లాలో కూడా ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ , రాష్ట్ర మంత్రుల సూచనతో ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తాం.

ప్ర: పంపిణీ ఏలా ఉంటుంది..?

జ: రేషన్ కార్డుల్లో ఒక్కో సభ్యునికి 6 కిలోల చొప్పున ఎంత మంది సభ్యులు ఉంటే అందరికి కలిపి పంపిణీ చేస్తాం. బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలి.

ప్ర: ఇప్పటి వరకు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడే ఆస్కారం ఉందా..?

జ: తప్పకుండా ఇప్పటి వరకు దొడ్డు బియ్యం కావడంతో లబ్ధిదారులు తినడానికి సంశయించారు. సన్నబియ్యం కావడంతో ప్రతి లబ్ధిదారుడు వినియోగించుకుంటారనే అభిప్రాయం ఉంది. రేషన్ బియ్యం పక్కదోవ పట్టే ఆస్కారం ఉండదని భావిస్తున్నాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్

పాఠశాలలకు మధ్యాహ్న భోజన వంట సామగ్రి

- జిల్లాలో 1001 పాఠశాలలకు సరఫరా చేసిన విద్యాశాఖ
- రూ.1.23కోట్ల నిధులతో వంట సామగ్రి పంపిణీ
- తీరనున్న మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఇబ్బందులు



పాఠశాలలకు వచ్చిన వివిధ రకాల వంట గిన్నెలు

అశ్వారావుపేట రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు తెలంగాణ ప్రభుత్వం వంట సామగ్రిని సరఫరా చేసింది. మధ్యాహ్న భోజనానికి సరిపడా వంట పాత్రలు లేకపోవటంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న గంటెలు, గిన్నెలతోనే వడ్డిస్తున్నారు. చిన్నారులకు నీళ్ల పోయటానికి కనీసం మగ్ కూడా ఉండని పరిస్థితి. దీంతో అటు నిర్వాహకులకు, ఇటు చిన్నారులకు ఇబ్బందులు తప్పటం లేదు. తద్వారా అనుకున్న మధ్యాహ్న భోజన లక్ష్యం నెరవేరటం లేదు. దీంతో ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి అవసరమైన వంట పాత్రలను సరఫరా చేయాలని నిర్ణయించి గత కొద్ది రోజులుగా పాఠశాలలకు వంట సామగ్రిని అందిస్తున్నారు.

జిల్లాలో 1001 పాఠశాలలకు

పాఠశాలలకు వంట పాత్రలు అందించాలని 2022-23 విద్యాసంవత్సరంలో రాష్ట్ర విద్యాశాఖ వివరాలు కోరింది. మండలాల నుంచి అందిన వివరాల ప్రకారం ఏ పాఠశాలకు సామగ్రి అవసరమో వివరాలు మండలాల నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాష్ట్రానికి అందాయి. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో సామగ్రి సరఫరాకు టెండర్లు నిర్వహించారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల కింద దాదాపు 1450పైగానే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. వంట సామగ్రి కావాలని కోరిన 1001 పాఠశాలలకు ప్రస్తుతం సామగ్రిని అందిస్తున్నారు. ఇందుకు రూ.1.23కోట్ల నిధులను వెచ్చించారు. ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి 3కిలోలు వండే గిన్నె 50కేజీల వరకు ఆహారాన్ని వండటానికి అవకాశం ఉన్న 8 రకాల గిన్నెలను అందిస్తున్నారు. వీటితోపాటు ప్రతిపాఠశాలకు స్టీల్ బకెట్, మంచినీళ్ల జగ్, బేసిన్, కాపర్ గిన్నెలు, వివిధ రకాల గరిటెలు, కుర్ఫీ ఇలా 9 రకాల సామగ్రిని అందిస్తున్నారు. ఇప్పటికే టెండర్లు దక్కించుకున్న సంస్థ మండలాలకు సామగ్రిని సరఫరా చేసి పాఠశాల హెచ్ఎంలకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అందిస్తున్నారు.

నిర్వాహకులకు తప్పిన కొనుగోలు భారం

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి అవసరమైన వంటపాత్రలను చాలా వరకు నిర్వాహకులే కొనుగోలు చేయాల్సి వస్తుంది. కొందరు తమకు వచ్చే గ్రాంటులో కొంత నగదులో వంట సామగ్రిని కొనుగోలు చేస్తుండగా.. కొన్ని పాఠశాలల్లో నిర్వాహకులే కొనుగోలు చేసుకుంటున్నారు. కొందరు అయితే పాత్రలు కొనుగోలు చేయలేక తమ ఇళ్లలో ఉన్న సామాగ్రితోనే వంట చేసి బడికి తీసుకు వచ్చి పెడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలకు అవసరమైన వంట సామగ్రి రావటంతో పూర్తిగా బడిలోనే అన్ని రకాల ఆహార పదార్థాలు వండటానికి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో హెచ్ఎంలు కూడా మధ్యాహ్న భోజనంపై పూర్తిస్థాయిలో విద్యార్థులు సరిపడా భోజనం అందేలా చూడాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

'షటిల్'లో బీటీపీఎస్‌కు తృతీయ స్థానం



క్రీడాకారులను అభినందిస్తున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

మణుగూరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): టీజీ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్స్ మూడు రోజులుగా కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ చెల్పూర్‌లో జరిగాయి. ఇందులో మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ జట్టు సభ్యులు పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబర్చి టీం ఈవెంట్‌లో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. జట్టు సభ్యులను శుక్రవారం బీటీపీఎస్ సీఈ బిచ్చన్న తన చాంబర్‌లో అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఈ అడ్మిన్ పార్వతి, డీఈ మురళీకృష్ణ, స్పోర్ట్స్ సెక్రటరీ కల్తీ నర్సింహారావు, జట్టు మేనేజర్ జీ.వెంకట్, కెప్టెన్ బి.సత్యనారాయణ, సభ్యులు డి.సతీష్‌రెడ్డి, బీ.శ్రీనివాసులు, వై.శ్రీనివాస్, కే.శ్రీకాంత్, డి.సురేష్, బి.శివకుమార్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శుభవార్త

- ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన వారికి నైపుణ్య శిక్షణ
- పీఎంఐఎస్ పథకంపై స్పెషల్ డ్రైవ్
- మెప్మా ఆధ్వర్యంలో అవగాహనకు ఆదేశాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మాధ్యమిక విద్యాభ్యాసం నిలిచిపోయి నిరుద్యోగులుగా ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వం వృత్తి నైపుణ్యత శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా పీఎంఐఎస్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. మార్చి చివరి వారం నుంచి ఏప్రిల్ మాసంలో మెప్మా ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు రూపొందించాలని శుక్రవారం మెప్మా డీఎంసీ, టీఎంసీ స్థాయి అధికారులతో రాష్ట్ర మెప్మా సమన్వయకర్త లక్ష్మారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలిచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పీఎంఐఎస్ పథకంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి నిరుద్యోగులకు వృత్తి, విద్యా నైపుణ్యశిక్షణకు ఆన్‌లైన్ చేయించాలని మార్గదర్శకాలు విడుదల చేశారు.

మాధ్యమిక విద్యాభ్యాసం చేసిన వారికి..

ప్రధానమంత్రి ఇన్‌టెన్‌షిప్ స్కీమ్(పీఎంఐఎస్)లో చేరేందుకు పది, ఇంటర్, ఐటీఐ స్థాయిలో విద్యాభ్యాసం చేసిన నిరుద్యోగులు అర్హులు. 21 నుంచి 24ఏళ్ల వయస్సు లోపు వారై ఉండాలి. వీరు విద్యాభ్యాసం చేసిన స్థాయిని బట్టి ప్రభుత్వశాఖలు, విభాగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వటం జరుగుతుంది. అందుకు గాను పీఎంఐఎస్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తి జరిగిన తర్వాత ప్రముఖ 200 కంపెనీల నుంచి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. ఏడాదికాలం పాటు శిక్షణ ఇస్తారు. శిక్షణా కాలంలో స్టైఫండ్ ఇస్తారు.

మెప్మా ఆధ్వర్యంలో అవగాహన

మెప్మా ఆధ్వర్యంలో నిరుద్యోగులకు అవగాహన కార్యక్రమాలు కల్పించనున్నారు. రూ.8 లక్షల వార్షిక ఆదాయం లోపు ఉన్న నిరుద్యోగులు. ప్రభుత్వ ఉద్యోగంలేని వారి పిల్లలు, ఇలా నిరుపేదలైన నిరుద్యోగులను మెప్మా ఆధ్వర్యంలో గుర్తించి వారితో ఆన్‌లైన్‌లో పీఎంఐఎస్ పథకానికి దరఖాస్తులు చేయిస్తారు. తర్వాత జిల్లా స్థాయి సెలెక్షన్ కమిటీలో వృత్తి నైపుణ్య శిక్షణకు ఎంపికలు పూర్తి జరుగుతాయి.

రెండో రోజు కొనసాగిన షూటింగ్



షూటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లెందు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే5 ఓసీలో శుక్రవారం రెండో రోజు హరిహరవీర మల్లు సినిమాషూటింగ్ కొనసాగింది. పలు సన్నివేశాలు చిత్రయూనిట్ సభ్యులతో చిత్రీకరించారు. స్థానిక కళాకారులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చిత్ర యూనిట్ సభ్యులపై షూటింగ్ చేశారు. రెండు రోజులపాటు ఇల్లెందులోని జేకే5ఓసీలో ఓసీలో హరిహరవీర మల్లు సినిమా షూటింగ్ సందర్భంగా కోలాహలం నెలకొంది. షూటింగ్‌ను శుక్రవారంతో ఇల్లెందులో ముగించనున్నట్లు సింగరేణి అధికారులు తెలిపారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నరేంద్ర కుమార్



జూలూరుపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన చంద్ర నరేంద్రకుమార్ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర 3వ మహాసభల్లో తనను ఎన్నుకున్నట్టు తెలిపారు. శుక్రవారం జూలూరుపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాలక ప్రభుత్వాల దివాలాకోరు విధానాలతో రోజురోజుకి రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగు చేపట్టండి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు



పురుగు మందుల షాపును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు

చంద్రుగొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అధిక లాభాలను అందిస్తున్న ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబురావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు వ్యాపారులు అన్ని వివరాలతో కూడిన స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేపట్టే ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరుశాతం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ సామగ్రి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ యాసంగిలో జిల్లాలో 63వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని వారందరికి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో స్థానిక వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కొత్తగూడేనికి మహర్దశ

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం భావిస్తోంది. ఎర్త్‌సైన్సు యూనివర్సిటీలో జియో కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెటరీ జియాలజీ, జియో నెప్రాలజీ, స్ట్రక్చర్ జియాలజీ, పర్యావరణ భూగర్భశాస్త్రం, ఖనిజశాస్త్రం వంటి పలురకాల భిన్నమైన కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఈ యూనివర్సిటీ ఏర్పాటు జరిగితే రాష్ట్రంలో కొత్తగూడెం విద్యారంగంగా ముందడుగు వేయనుంది.

త్వరలో ఎయిర్‌పోర్టు..

కొత్తగూడెం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కూడా ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. మంత్రి తుమ్మల చొరవ తీసుకుని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని కలిసి వినతిపత్రం అందించడం, ఆ తర్వాత వేగంగా ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వెళ్లడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి తుమ్మల సూచనలు దృష్టిలో ఉంచుకుని ఎయిర్‌పోర్టుకు సానుకూలత వ్యక్తంచేయడం జరిగింది. ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి పరిశీలన బృందానికి అవసరమైన నివేదికలు కూడా రాష్ట్రం నుంచి వెళ్లాయి. కొత్తగూడెం సమీపంలోనే ఎయిర్‌పోర్టుకు అవసరమైన భూమిని ప్రభుత్వం సిద్ధం చేసింది. దీంతో రెండు దశాబ్దాలకుపైగా కొత్తగూడెం ఎయిర్‌పోర్టు డిమాండ్ త్వరలో కార్యరూపం దాల్చే అవకాశం ఉంది.

వరంగల్ ఎయిర్‌పోర్టు తర్వాత కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వబోతుంది. సింగరేణి, నవభారత్, ఎన్ఎండీసీ, కేటీపీఎస్, భద్రాద్రి పవర్‌ప్లాంట్, ఐటీసీ భద్రాచలం, హెవీవాటర్ ప్రాజెక్టు వంటి పారిశ్రామిక సంస్థలతో పాటు భద్రాచలం పుణ్యక్షేత్రం, సరిహద్దు ఛత్తీస్‌గఢ్, ఒడిసా, ఏపీ రాష్ట్రాల ప్రయాణికులకు సైతం ఈ ఎయిర్‌పోర్టు సౌలభ్యంగా నిలవబోతోంది.

కోల్డ్ స్టోరేజీలకు డిమాండ్

(5వ పేజీ తరువాయి)

కొంత ఆశ వారిని కోల్డ్ స్టోరేజీల వైపు మళ్లించాయి. అంతేకాకుండా ఖమ్మం పరిసరాల్లో పండించే మిర్చికి గతంలో కన్నా డిమాండ్ తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. పంటలో వైరస్, తెగుళ్ల ప్రభావంతో మిర్చిలో నాణ్యత తగ్గడం తోపాటు మిర్చిలో ఆయిల్ రావడం తగ్గి కొంత అంతర్జాతీయంగా డిమాండ్ సన్నగిల్లిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతేడాది కోల్డ్ స్టోరేజీల్లో పంట నిల్వ చేసి భారీగా నష్ట పోయిన వ్యాపారులు, రైతులకు ఈ ఏడాది ఎలా ఉంటుందోనని ఆందోళనలో ఉన్నారు.

కోల్డ్ స్టోరేజీల భారం

మార్కెట్‌లో మిర్చి ధరలు పడిపోయి రైతులు మదనపడుతుంటే, నిల్వ చేసేందుకు మా కోల్డ్‌స్టోరేజీలో చోటు లేదు. ఎక్కువ కిరాయి ఇస్తేనే నిల్వ చేసుకుంటామని కొందరు కోల్డ్‌స్టోరేజీల నిర్వాహకులు అంటున్నట్టు తెలిసింది. గతేడాది బస్తాకు రూ.212 నుంచి రూ.220 వరకు అద్దె వసూలు చేసిన యజమాన్యాలు ఈ ఏడాది మెయింటెనెన్స్ ఖర్చులు పెరిగాయనే సాకుతో బస్తాకు రూ.227 నుంచి రూ.230 వరకు పెంచడం గమనార్హం.

జిల్లాలో ఉన్న కోల్డ్ స్టోరేజీలు: 48
నిల్వ సామర్థ్యం: 47 లక్షల బస్తాలు
ప్రస్తుత నిల్వ: 40 లక్షల బస్తాలు
ఖాళీ: 7 నుంచి 8 లక్షల బస్తాల వరకు

భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

వైద్యశాఖ సహకారంతో ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నాం.

19 ప్రసాదాల కౌంటర్లు

నవమికి తరలివచ్చే భక్తుల కోసం 19 ప్రసాదాల కౌంటర్లు, 60 తలంబ్రాల పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతోంది. నవమి అనంతరం కార్గో, పోస్టల్, ఆన్‌లైన్, ప్రచార శాఖల ద్వారా ముత్యాల తలంబ్రాలను పంపేందుకు చర్యలు చేపడుతున్నాం. అదేవిధంగా పరోక్ష సేవలు పొందేవారికి తలంబ్రాలను పంపనున్నాం. ఈసారి నవమికి వంద కేజీల ముత్యాల వరకు సిద్ధం చేస్తున్నాం.

రెండు లక్షల లడ్డూలు

ఈసారి నవమికి రెండు లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్నాం. ఇందుకోసం 30 మంది సిబ్బంది తయారీలో నిమగ్నం కానున్నారు. లడ్డూ తయారీ సమయంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరాం. పెద్ద లడ్డూలను 10 వేలు తయారు చేయనున్నాం.

రామాలయాన్ని దర్శించుకున్న ఐఆర్ఎస్ అధికారులు



రామాలయంలో ఐఆర్ఎస్ అధికారులు

భద్రాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని జీఎస్‌టీ కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసరావు, అడిషనల్ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ టాక్స్ శ్రీదేవిలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే మహారాష్ట్రకు చెందిన పవన్‌కుమార్, కామాక్షి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందజేశారు.

భద్రాద్రిలో ముగిసిన శిథిలాల తొలగింపు



ధర్నా చేస్తున్న దృశ్యం



శిథిలాల తొలగింపు ముగిసిన దృశ్యం

(5వ పేజీ తరువాయి)

ఫోర్స్ సిబ్బంది వారిని శిథిలాల నుంచి వెలికితీశారు. కామేశ్వరరావును బుధవారం అర్ధరాత్రి బయటకు తీసి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడు. గురువారం అర్ధరాత్రి ఉపేందర్‌రావు మృతదేహాన్ని బయటకు తీసి ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు, బందు మిత్రుల రోదనలతో ఆ ప్రాంతం మిన్నంటింది. సుమారు 42 గంటల పాటు రెస్క్యూ బృందాలు, గ్రామ పంచాయతీ సిబ్బంది శిథిలాల తొలగింపు, గాలింపు చర్యల్లో పాల్గొన్నారు.

ఇదిలావుండగా, ప్రమాదంలో మృతిచెందిన భవన నిర్మాణ కార్మికులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏరియా వైద్యశాలలో మార్చురీ వద్ద సీపీఎం, బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ తదితర సంఘాలు ఐదు గంటలపాటు ధర్నా నిర్వహించాయి. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఈ ఘటనలో శిథిలాల్లో ఉన్న వారిని వెలికితీయడంలో అధికార యంత్రాంగం పని చేసిన తీరును అభినందించారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో రేగా కాంతారావు ఈ విషయమై భద్రాచలం ఆర్డీవోతో సైతం మాట్లాడారు.

కాగా మృతుల కుటుంబాలకు ఇంటి యజమాని ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం అందజేసేందుకు సంబంధిత యజమాని అంగీకరించినట్టు సమాచారం. కాగా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి డబుల్‌బెడ్‌రూంలు,

కుటుంబానికి ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం, పిల్లల చదువు ప్రభుత్వ బాధ్యతగా తీసుకుంటామని, ఈ ఘటనపై విచారణ జరిపిస్తామని ఎమ్మెల్యే వెంకట్రావు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

భవనం కూలిన ఘటనపై కేసు నమోదు

భద్రాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) భద్రాచలంలో బహుళ అంతస్తుల భవనం కూలిన ఘటనలో ఇంటి యజమాని శ్రీపతి దంపతులపై శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు భద్రాచలం సీఐ బరపాటి రమేష్ తెలిపారు. ఇంటిపై ఐదు అంతస్తులు కడుతుండగా మూడు రోజుల క్రితం ఒకేసారి భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. ఈ క్రమంలో బాధితుల ఫిర్యాదు చేయగా, శ్రీపతి దంపతులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

సంక్షోభంలో తెలంగాణ రైతాంగం: బీజేపీ



ధర్నా చౌక్‌లో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

ఖమ్మం బైపాస్ రోడ్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉందని రైతులను, రైతుల సమస్యలను గాలికి వదిలేసి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆరోపించారు. కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నాచౌక్‌లో శుక్రవారం రైతు సత్యాగ్రహ దీక్షను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలుచేయకపోతే మంత్రులు ఇళ్లను ముట్టడిస్తామన్నారు. రైతుల సమస్యలను లెక్కచేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని, రుణమాఫీ పెట్టుబడి సాయం, ధాన్యం కొనుగోలు వంటి అంశాలలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మండిపడ్డారు.

ఎన్నికల ముందు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కొంతమందికి రుణమాఫీచేసి మిగతవారికి పట్టించుకోవడంలేదన్నారు. కొనుగోలు కేంద్రాలు సమయానికి ప్రారంభించకపోవడంతో మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులరుణమాఫీ అమలుచేయాలని, అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా ప్రారంభించాలని, పంటలకు గిట్టుబాటు ధర నిర్ధారించి వరదలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు నష్టపరిమారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకరరెడ్డి, నున్నా రవికుమార్, శ్యాంరాథోడ్, చావా కిరణ్, రమేష్, వెంకటరెడ్డి, సీతారాం నాయక్, బిక్షపతి, బాలునాయక్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహా ఆవరణార్చన గ్రంథం ఆవిష్కరణ



శీలక్ష్మీ నరసింహ ఆవరణార్చన కల్పం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న విద్యా శంకర భారతీ స్వామి

బోనకల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన ఇంగువ మురళీకృష్ణ శర్మ సిద్ధాంతి రచించిన 'శ్రీలక్ష్మీ నరసింహ ఆవరణార్చన కల్పం' అనే గ్రంథాన్ని హైదరాబాద్‌లోని పుష్పగిరి పీఠంలో గురువారం రాత్రి పీఠాధిపతి శ్రీ విద్యా శంకరభారతి స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి కష్టమైన నరసింహస్వామి ఉపాసన, అర్చన విధానాన్ని తెలుగు లిపిలో మొట్ట మొదటిగా రచించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. నృసింహ ఉపాసన నిత్యం జరిగే పుష్పగిరి పీఠంలో ఈ గ్రంథం ఆవిష్కరించడం స్వామి వారి అనుగ్రహం వలనే సాధ్యమైందని తెలిపారు. అపూర్వమైన రచన చేసిన గ్రంథకర్త మురళీకృష్ణ శర్మను ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో అద్భుతమైన గ్రంథాలను రచించేందుకు స్వామి వారి అనుగ్రహం ఉండాలని ఆశీర్వదించారు.

ప్రణాళికాబద్ధంగా 'ప్యాక్స్' పనిచేయాలి

- రైతులకు ప్రత్యామ్నాయంగా అదనపు ఆదాయ మార్గాలు అన్వేషించాలి
- జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ సొసైటీలు(పాక్స్) ప్రణాళికాయుతంగా పనిచేయాలని, దీనికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు ఆశించిన రీతిలో పని చేయడం లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. రైతులకు సరైన సమయంలో తక్కువ వడ్డీతో పెట్టుబడి అందించడం, రైతుల నుంచి డిపాజిట్ సేకరణ జరగాలన్నారు. పాక్స్‌లో ఉన్న సభ్యులు క్రియాశీలంగా ఉండేలా చూడాలని అన్నారు. రైతులకు ఉపయోగపడే నూతన కార్యక్రమాలను చేపట్టేలా ప్రణాళిక చేయాలని సూచించారు. జిల్లాలో ఎన్నిక్రెడిట్ సొసైటీలు సరిగ్గా పని చేస్తున్నాయో వివరాలతో నివేదికలను అందించాలన్నారు. క్రెడిట్ సొసైటీల ద్వారా రైతులకు నూతన సాగు పద్ధతులు, ఫిష్ ఫార్మింగ్, ఫిష్ పాండ్స్, ప్రత్యామ్నాయ పంటల సాగు వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు సమావేశాల నిర్వహణ షెడ్యూల్ సిద్ధం చేయాలన్నారు. సింగరేణి మండలంలో కోతుల బాధ అధికంగా ఉందని, వీటి పరిష్కారానికి రైతులు ఎటువంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై అధ్యయనం చేయాలని అన్నారు. రైతులకు ఇతర ఆదాయ మార్గాలు ఎలా కల్పించాలి అనే అంశంపై కూడా పాక్స్ పని చేయాలన్నారు. పాక్స్ సమావేశాలు క్రమతప్పకుండా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ ఎల్. సుజిత్ కుమార్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి జి. గంగాధర్, వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, మత్స్యశాఖ అధికారి జి. శివ ప్రసాద్, పశు సంవర్ధక శాఖ ఏడీ కె. శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ విద్యావిధానం

- ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్



రుద్రంపూర్(సింగరేణి), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పాఠశాల లో కొత్త విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ విద్యా విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా తొమ్మిది పాఠశాలలను, రెండు మహిళ జూనియర్ కళాశాలలు, ఒక డిగ్రీ కళాశాలతోపాటు పాలిటెక్నిక్ కళాశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇంగ్లిష్ మీడియం వైపు ఆసక్తి పెరగడంతో సింగరేణిలోని గోదావరిఖని సెక్టార్ పాఠశాలలో సీబీఎస్ఈ విద్యావిధానాన్ని ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఈ ఏడాది సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో న్యాక్ అక్రిడేషన్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్, బిట్స్ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో సైన్స్‌ఫెయిర్, సైన్స్ ఎగ్జిబిషన్, ఎడ్యుకేషన్ టూర్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. మహిళా డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ వచ్చే విధంగా పలు సంస్థలతో చర్చలు జరిపేందుకు ప్రత్యేక కమిటీని నియమించామని తెలిపారు.

ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టంను ఉపసంహరించుకోవాలి

- భద్రాద్రి కొత్తగూడెం జేఏసీ నాయకులు



డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న జేఏసీ నాయకులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి28(ఆంధ్రజ్యోతి): ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టంను తక్షణమే ఉపసంహరించుకోవాలని డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్‌కు భద్రాద్రి జేఏసీ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టంలో ఆరోగ్యశాఖలో వివిధ విభాగాలలో పని చేస్తున్న సిబ్బందిని మానసికంగా ఇబ్బందులకు గురి చేయడమే అవుతుందని అన్నారు. సిబ్బంది యొక్క వ్యక్తిగత సమాచారాన్ని, గోప్యతను ప్రైవేటు యాప్‌ల చేతుల్లో పెట్టి వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోవడమే అవుతుందని ఆగ్రహించారు. సైబర్ క్రైమ్‌కు పాల్పడే వారికి మంచి అవకాశంగా ఉంటుందని దీనిని రద్దు చేయాలని కోరారు. ఇప్పటికే వైద్య ఆరోగ్య సిబ్బంది రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆన్‌లైన్ , రిపోర్టింగ్ పనులు చేస్తూ శారీరక , మానసిక అనారోగ్యంతో ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ డాక్టర్ బాలాజీ, నాయకులు గొంది వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, జి.నాగభూషణం, బి.లాలు, ఎబ్నిజర్, బి.రాంప్రసాద్, కుమారస్వామి, ఉమాదేవి, సులోచన, రమాకుమారి, కళావతి, సుజాత, సైదా పాల్గొన్నారు.

రుణమాఫీ అంతా మాయ

మహాజన సభలో రైతుల అసంతృప్తి



మహాజన సభలో బొర్రా రాజశేఖర్

వైరా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రూ.రెండులక్షల రుణ మాఫీ అంతా మాయా, మోసమని రైతులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్, సొసైటీ అధ్యక్షుడైన అయిన బొర్రా రాజశేఖర్ అధ్యక్షతన శుక్రవారం వైరా సొసైటీ మహాజన సభ జరిగింది. ఈ సభలో కాంగ్రెస్ పార్టీకే చెందిన బ్రాహ్మణపల్లి అగ్రహారానికి చెందిన పోటు మధుసూదన్‌రావు, మరికొంతమంది రైతులు రూ.2లక్షల రుణ మాఫీ, రైతుభరోసా అమలుపై ప్రస్తావించారు. అధ్యక్ష స్థానంలో ఉన్న బొర్రా రాజశేఖర్ ఇప్పటివరకు రాష్ట్రంలో 25లక్షల మంది రైతులకు రూ.20,617కోట్ల రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి బోనస్ చెల్లింపుల గురించి వివరించి సముదాయించినప్పటికీ వారు సంతృప్తి చెందలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని గెలుపు కోసం నడుంబిగించి పనిచేశామని, రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఆశించామని తీరా ఇప్పుడు రుణమాఫీపై అంతా మాయా, మోసం చేశారని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వలన రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని ఆక్షేపించారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభివృద్ధి, సంక్షేమంతోపాటు అన్నివర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక పథకాలు చేపడుతుందని రాజశేఖర్ వివరించారు. సొసైటీ కార్యదర్శి బొల్లం రామకృష్ణ సొసైటీలో జరిగిన కార్యకలాపాల గురించి నివేదిక ప్రవేశపెట్టారు. డీసీవో ఇందుమతి, సొసైటీ డైరెక్టర్లు తేజావత్ రామకృష్ణ, కొప్పుల వెంకటేశ్వరరావు, బొల్లెపోగు శ్రీను, తాతా బసవయ్య, పర్సారి స్వరూపరాణి, తడికమళ్ల ధనలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే రత్నం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మచ్చా బుజ్జి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకుడు బొళ్ల గంగారావు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు జనసమీకరణ

తల్లాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో శనివారం జరిగే సీనియర్ రాజకీయ వేత్త, మాజీ సర్పంచ్ జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహావిష్కరణ సభకు భారీ ఎత్తున జనాన్ని తరలించాలని సొసైటీ చైర్మన్ దిరిశాల నర్సింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం బిల్లుపాడులో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యఅతిథిగా హాజరవుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు స్టేజీ పినపాక వద్ద ఘనస్వాగతం పలకాలని అక్కడి నుంచి కార్లు, బైక్‌లతో బిల్లుపాడు వరకు జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

31 నుంచి కోటమైసమ్మతల్లి బ్రహ్మోత్సవాలు

కారేపల్లి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఉసిరికాయలపల్లి గ్రామంలో గల శ్రీకోటమైసమ్మతల్లి ఆలయంలో ఈనెల31 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు మూడురోజులపాటు అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పర్సాపట్టాబి రామారావు, కార్యనిర్వహణాధికారి కె.వేణుగోపాలచార్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు ఇల్లెందు వ్యాపారులు, విద్యాసంస్థల అధినేతల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తారని తెలిపారు.

శతక పద్యాలతో మనోవికాసం

- డీఈవో సోమశేఖరశర్మ
- సత్తుపల్లి జేవీఆర్‌లో ద్వాదశ పృచ్ఛక అవధానం



ఆఫ్రియాను సన్మానిస్తున్న డీఈవో సోమశేఖరశర్మ

సత్తుపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు గురువులు, తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే ఆఫ్రియా వంటి మేధావులను సమాజానికి అందించవచ్చని డీఈవో సోమశేఖరశర్మ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గార్లపాటి, బొల్లేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో 7వ తరగతి విద్యార్థిని మహ్మద్ ఆఫ్రియా బాల అవధానిగా వేమన శతకంపై 12మంది పృచ్ఛకులతో ద్వాదశ పృచ్ఛక అవధానం నిర్వహించారు. పట్టుమని 10పద్యాలు చదవడం రాని నేటి పరిస్థితుల్లో వంద వేమన పద్యాలు చదవడం, రాయడం నేర్చుకోవడమే గొప్ప అయితే ఏకంగా శతకంపై అవధానం చేసి ఆఫ్రియా అద్భుతాన్ని సృష్టించిందన్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు వంశీ, పోతురాజు రాములు వేమన శతకంపై అవధానం చేశారు. అనంతరం విద్యార్థులతో పాటు ఆఫ్రియా, ఆమె తల్లిదండ్రులు ఉస్మాన్, రబియా, నిర్వాహకులను డీఈవో జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు నక్కా రాజేశ్వరరావు, సత్యనారాయణ, ఇంచార్జీ ప్రిన్సిపాల్ వై.మహేష్, పూర్ణచంద్రరావు, విజయలక్ష్మి, మాధవి, ట్రస్ట్ నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదనరాజు, పీజీ హెచ్‌ఎం పూరేటి యాకోబు, ఆషా, లయన్స్ సంస్థల నిర్వహకులు వాసు, శేషగిరిరావు, మాదిరాజు మాలతి, రామిశెట్టి శ్రీను, దొడ్డా కృష్ణయ్య, రమణమూర్తి, రజినిదేవీ, రమాదేవి, నర్సయ్య, రమణ, ఖాసీం, ప్రసాద్ పాల్గొన్నారు.

ఈతకువెళ్లి.. విద్యార్థి మృతి

- కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో విషాదం
- మృతుడు ఎనిమిదో తరగతి విద్యార్థి



మృతదేహాన్ని నీళ్లలో నుంచి బయటకు తీస్తున్న స్థానికులు, సాయి మృతదేహం

కొణిజర్ల, మార్చి28(ఆంధ్రజ్యోతి): గంటలో పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థి సాగర్‌కాల్వలో ఈతకు వెళ్లి గల్లంతై మృతిచెందిన సంఘటన శుక్రవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సూరజ్, స్థానికులు, మృతుడి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. తనికెళ్లకు చెందిన బత్తుల కనకారావు, కోటేశ్వరి దంపతుల కుమారుడు బత్తుల సాయి(15) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలలో పదో తరగతికి ఉదయం పరీక్ష కేంద్ర ఉండటంతో మధ్యాహ్నం పాఠశాల నిర్వహిస్తున్నారు. మరో గంటలో పాఠశాల ప్రారంభమవుతుందనగా సాయి, అదే వయస్సు గల మరో ఇద్దరు స్నేహితులు కలిసి గ్రామ సమీపంలోని బోనకల్ బ్రాంచ్ కెనాల్ కాల్వకు ఈతకు వెళ్లారు. కాల్వ నిండుగా ప్రవహిస్తోంది. ఇద్దరు స్నేహితులకు ఈత రావడంతో వారు కాల్వ మధ్యకు వెళ్లి ఈత కొడుతున్నారు. సాయికి ఈతరాకపోవడంతో కాల్వలో దరి వెంట ఈతకొడుతున్నాడు. కాల్వ ప్రవాహానికి సాయి నీటిలో కొట్టుకుంటూ మునిగిపోయాడు. ఇద్దరు స్నేహితులు భయంతో గ్రామంలోకి వెళ్లి సమాచారం ఇచ్చారు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి అందరు కలిసి కాల్వ వద్దకు చేరుకున్నారు. స్థానికులు చాలా మంది కాల్వలోకి దిగి సాయి కోసం గాలింపుచర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సూరజ్ కాల్వ వద్దకు చేరుకున్నారు. పడిన చోట నుంచి రెండు కిలోమీటర్ల దూరం వరకు గాలించిన కనపడలేదు. సాయి నీటిలో పడిన చోటుకు సమీపంలో గాలిస్తుండగా సాయి మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం తరలించారు.

మృతుడి తండ్రి మాత్రం తన కుమారుడుకి ఈత రాదని, అటువంటి వాడు కాల్వలోకి ఎందుకు దిగుతాడని, ఇద్దరు స్నేహితులపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నాడు. తండ్రి కనకారావు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కనకారావు, కోటేశ్వరి దంపతులకు సాయితో పాటు ఆరో తరగతి చదివే కుమార్తె వైష్ణవి ఉంది.

అంగన్‌వాడీ ఆయా బదిలీపై వివాదం



మహిళలతో మాట్లాడుతున్న చంద్రుగొండ ప్రాజెక్ట్ సీడీపీఓ. సలోమి

జూలూరుపాడు,మార్చి28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఆయా బదిలీని అధికారులు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారంటూ మహిళలు ఆందోళనకు దిగారు. మండలంలో వెంగన్నపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం-2లో ఆయా పోస్టుఖాళీగా ఉంది. దీంతో అధికారులు 2018లో ఆయా పోస్టును భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించారు. దీంతో జూలూరుపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని కోయకాలనీకి చెందిన కూరం వరలక్ష్మీ తన ఓటరు గుర్తింపు కార్డును వెంగన్నపాలేనికి మార్చుకుని ఆయాపోస్టుకు దరఖాస్తు చేసుకుంది. ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఇప్పటికే జూలూరుపాడులోని అంగన్‌వాడీ-4 కేంద్రంలో టీచర్, ఆయా పోస్టు ఖాళీగా ఉండటంతో వెంగన్నపాలెంలో ఉంటున్నట్లు ధృవీకరణ పత్రాన్ని సృష్టించుకుని అక్కడ బదిలీ చేయించుకుంది. నిబంధనలకు విరుద్ధంగా ఆయాను బదిలీ చేయటాన్ని నిరసిస్తూ కోయకాలనీకి చెందిన కొంతమంది మహిళలు ధర్నాకు దిగారు.స్థానిక మహిళలతోనే జూలూరుపాడు అంగన్‌వాడీ కేంద్రం-4 ఆయాను భర్తీ చేయాలని కోరారు. జూలూరుపాడులోని అంగన్‌వాడీ కేంద్రం-3లో సమావేశాన్ని అడ్డుకున్నారు. గేటుకు తాళం వేశారు. సూపర్‌వైజర్‌తో వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న చంద్రుగొండ ప్రాజెక్ట్ సీడీపీఓ సలోమి జూలూరుపాడులోని ఆందోళన చేస్తున్న మహిళల వద్దకు వచ్చారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వైన్‌షాపులో చోరీ

కొణిజర్ల,మార్చి28(ఆంధ్రజ్యోతి): కొణిజర్లలోని బస్వాపురం రోడ్డులో గల లక్ష్మీనరసింహ వైన్‌షాపులో చోరీ జరిగింది. ఎస్‌ఐ సూరజ్ వివరాల ప్రకారం.. లక్ష్మీనరసింహ వైన్‌షాపులో గురువారం అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగిందని, శుక్రవారం ఉదయం షాపు నిర్వాహకులు షాపుతీసే సమయంలో తాళంతీసి చూడగాషాపు వైరేకులు కట్ చేసి షాపులోనే మద్యాన్ని ఎత్తుకెళ్లారని చెప్పారు. మద్యం ఎంత అనేది నిర్వాహకులు ఫిర్యాదు చేయాల్సి ఉందన్నారు.

సామగ్రి దగ్ధం

భద్రాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని రెవెన్యూ కాలనీలో కటారి సుబ్బారావుకు చెందిన ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.

రేషన్ బియ్యం చోరీని ఛేదించిన పోలీసులు

కల్లూరు,మార్చి28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో ఇటీవల రేషన్ బియ్యం చోరీ కేసును పోలీసులు ఛేదించారు కల్లూరు ఏసీపీ ఎ.రఘు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈవివరాలను వెల్లడించారు. వైరా మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన ఓర్సు హనుమంతరావు, అతడి సోదరుడు కృష్ణ అలియాస్ దొర రేషన్ బియ్యం కొనుగోలు చేసి అమ్ముతున్నారు. ఇది లాభసాటిగా లేదని భావించి రేషన్ బియ్యం చోరీ చేయాలని నిర్ణయిం చుకున్నారు. గతంలో రేషన్ బియ్యం వ్యాపారం సహకరించిన వైరా మండలం కొండకొడిమ గ్రామానికి చెందిన నల్లబోతుల ఉదయ్, వెలిశాల చందు, ఎన్టీఆర్ జిల్లా నెమలి గ్రామానికి చెందిన అశోక్ లిలాండ్ వ్యాన్ డ్రైవర్ గరిడేపల్లి జగదీష్ అలియాస్ సాయి దీనికి అంగికరించారు. ఈనేపథ్యంలో చిన్నకోరుకొండిలోని కిష్టారం రోడ్ వైపున గల రేషన్ షాప్‌లో ఈనెల 16న నలుగురు కూలీల తీసుకొచ్చి 90క్వింటాళ్ల (180 బస్తాలు) బియ్యం రెండు వ్యాన్లలో ఎత్తుకెళ్లారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నెమలి గ్రామానికి చెందిన కురాకుల మురళి ఇంటికి తరలించారు. వీటిల్లో కొన్ని బియ్యాన్ని గంపలగూడెం మండలం వినుగడప గ్రామ శివారు కోళ్ల ఫారాం యాజమాని కాంతరెడ్డికి రూ.50వేలకు, మరో30క్వింటాళ్లను వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన నరిసింహారావు అనే వ్యాపారికి రూ.60 వేలకు విక్రయించారు. మిగిలిన 35క్వింటాళ్ల బియ్యం మురళి ఇంటి వద్ద నిలువ ఉంచారు. ఈ బియ్యాన్ని అమ్మేందుకు యత్నిస్తుండగా స్థానిక పోలీసులకు సమాచారం అందినట్లు ఏసీపీ వివరించారు. శుక్రవారం మధ్యాహ్నం నెమలిలో కురాకుల మురళి ఇంటి వద్ద వెళ్లి అక్కడ ఉన్న ఓర్సు హనుమంతరావు, గరిడేపల్లి జగదీష్, నల్లబోతుల ఉదయ్, కూరాకుల మురళిలను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రఘు చెప్పారు. ఓర్సు దొర, చందు పరారీ ఉన్నారు. దొంగసొత్తు కొనుగోలు చేసిన కాంతారెడ్డి, నరిసింహారావును అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టామని రఘు తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితులను సత్తుపల్లి కోర్టుకు హాజరు పరచనున్నట్లు చెప్పారు.

తాటిచెట్టు పడి చిన్నారి మృతి



దుమ్ముగూడెం,మార్చి28(ఆంధ్రజ్యోతి):ఇంటి వెనుక ఆడుకుంటున్న చిన్నారి మీద తాటిచెట్టు పడడంతో సోందె ప్రసన్నశ్రీ(3) మృతిచెందిన సంఘటన కోయనరసాపురంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రసన్న తల్లి సుమలత ఇంటి వెనుక ఎండిపోయిన తాటిచెట్టుకు నిప్పుపెట్టింది. ఈ చెట్టు సమీపాన ప్రసన్నశ్రీ, ఇద్దరు అక్కలతో కలిసి ఆడుకుంటుండగా, తల్లి కూడా అక్కడే ఉంది. కాలిన తాటిచెట్టు ఒక్కసారిగా ప్రసన్నశ్రీ నడుము మీద పడడంతో తీవ్రగాయాలపాలైంది. దీంతో భద్రాచలం ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్,మార్చి28 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో జరిగింది. ఎస్‌ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భీముని గూడెం గ్రామానికి చెందిన యర్రం నరసింహారావు(55)కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. మద్యానికి డబ్బులు ఖర్చు చేస్తే కుటుంబాన్ని పట్టించుకోవటం లేదు. దీంతో కుటుంబం కష్టంగా మారటం, భార్య శారదకు, నరసింహారావుకు తరచుగా గొడవలు జరిగేవి. ఇదే తరుణంలో గురువారం కూడా అతిగా మద్యం సేవించి ఇంటికిరాగా భార్య మద్యం తాగటం మానుకోవాలని మందలించింది. దీంతో మద్యం మత్తులో ఉన్న నరసింహారావు మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఖమ్మం తరలించి వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యయాతిరాజు వివరించారు.

కత్తితో మహిళపై దాడి



గాయపడ్డ మహిళ

నేలకొండపల్లి,మార్చి28(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి సుందరయ్యచౌక్ సమీపంలో ఓ యువకుడు దారిలో వెళుతున్న మహిళపై ఆకస్మాత్తుగా కత్తితో దాడి చేశాడు. స్థానికుల వివరాల ప్రకారం నేలకొండపల్లికి చెందిన కుమ్మరికుంట్ల కౌసల్య అనే మహిళ శుక్రవారం ఉదయం టిఫిన్ కొనుక్కుని తిరిగి ఇంటికి వెళుతున్నది. ఈక్రమంలో నేలకొండపల్లికే చెందిన ముప్పాళ్ల చంద్రశేఖర్ అనే యువకుడు అకస్మాత్తుగా కౌసల్యపై కత్తితో దాడి చేసి గొంతుపై గాయం చేశాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దాడికి పాల్పడ్డ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.. సదరు యువకుడు అప్పుడప్పుడూ మతిస్థిమితం కోల్పోతుంటాడని స్థానికులు చెపుతున్నారు.

జరిమానాలతో హడల్



సోఫా వ్యాపారికి జరిమానా అందిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంలో బాధ్యాతారహిత్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది వ్యాపారస్తులకు కేఎంసీ పారిశుధ్య విభాగం అధికారులతో జరిమానాలతో హడలెత్తించారు. భారీ జరిమానాలతో మరో సారి రహదారులపై చెత్త పడేయకుండా హెచ్చరించారు. కాల్వొడ్డు, జూబ్లీపుర,నయాబజార్ కాలేజీ ప్రాంతాల్లో సింగిల్ యూజ్‌కవర్లు అమ్మకాలు చేస్తున్న వ్యాపారులకు రూ.8వేలు జరిమానా విధించారు. 21వ డివిజన్‌లో వినాయక సోఫా కవర్స్ వ్యాపారులు రహదారిపై చెత్తనే పడేసినందుకు గాను రూ.3వేలు జరిమానా విధించారు. 45వ డివిజన్‌లో బాలాజీ బార్ నిర్వహకులు రహదారిపై చెత్తను డంప్ చేసినందుకు రూ.2వేలు జరిమానా విధించారు. సమీపంలో ఉన్న ఫొటో ఫ్రేమ్‌వర్క్ షాపునకు రూ.వెయ్యి జరిమానా విధించారు.



కేఎంసీ ఆధ్వర్యంలో ప్రతీ డివిజన్‌లో చలివేంద్రాలు



ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి27(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీర్చేందుకు కేఎంసీ పాలకవర్గం ముందుకొచ్చింది. ఖమ్మం నగరంలోని 60డివిజన్‌లోని బస్టాండ్‌లు, మార్కెట్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన రహదారులు, జనసంచారం అధికంగా ఉండే కూడళ్లలో చలి వేంద్రాలను ఏర్పాటు చేసింది. వెదురు కొమ్మలతో గుడిసెలను ఏర్పాటు చేసి వాటిలో మట్టి కుండలు, నీళ్ల ఏర్పాటు చేశారు. వాటిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని కేఎంసీ కమిషనర్ నియమించారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

విద్యతోనే జీవన ప్రమాణాల మెరుగు

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
» పాలేరులో నవోదయ వార్షికోత్సవానికి హాజరు

కూసుమంచి, మార్చి28(ఆంధ్రజ్యోతి): విద్యతోనే జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం కూసుమంచి మండలం పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో వార్షికోత్సవంలో పాల్గొన్నారు. జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు విద్య తప్పనిసరి అన్నారు. ప్రస్తుతం చదువుకుంటే భవిష్యత్తులో మన తల్లితండ్రులను బాగా చూసుకోవచ్చన్నారు. ప్రస్తుతం మనకు నవోదయ పాఠశాల వంటి అద్భుతమైన చోట చదువుకునే అవకాశం వచ్చిందని దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లితండ్రులను, గురువులను గౌరవం ఇవ్వాలన్నారు. పుస్తక పఠనం అలవర్చుకోవాలని కలెక్టర్ చెప్పారు. ప్రతిరోజు గంటసమయం పుస్తకాలు చదివేందుకు కేటాయించాలని, పరీక్షలకోసం కాకుండా విజ్ఞానం కోసం చదవాలన్నారు. ఫోన్‌లతో గడపడం తగ్గించుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. కఠిన ప్రవేశ పరీక్షలకు ఉత్తీర్ణత సాధించి నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించాలన్నారు. లభించిన అవకాశాల ద్వారా ఎదుటివారికి సాహాయపడాలన్నారు. ఈసందర్భంగా వివిధ అంశాలలో విజేతలకు కలెక్టర్ జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటరమణ, పేరెంట్స్ టీచర్ కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, నవోదయ అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మిషన్‌భగీరథ ఎస్‌ఈ

ఖమ్మంకలెక్టరేట్: మిషన్‌భగీరథ ఎస్‌ఈగా బాధ్యతలు చేపట్టిన జి.శేఖర్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఎస్‌ఈకి సూచించారు. ఆయన వెంట ఈఈ పుష్పలత ఉన్నారు.

ఆటోల అడ్డాగా ఇసుక డిపో

» భవన వ్యర్థాలు పారబోత
» మూడేళ్లకు పైగా మూసివేత
» పట్టించుకోని టీజీఎండీసీ అధికారులు





ఆటోలు నిలిపి ఉన్న టీఎస్‌ఎండీసీ ఇసుక డిపో, డిపోలో ఇంటి వ్యర్థాలు పారబోసిన వైనం

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి28 (ఆంధ్రజ్యోతి):ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన టీజీఎండీసీ (తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఇసుక డిపో ఆటోలకు అడ్డాగా మారింది. మూడేళ్లకుపైగా మూతబడటంతో పాత ఇళ్ల నిర్మాణాలు కూల్చివేసిన వ్యర్థాలను ఇక్కడ పడేస్తున్నారు. రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారటంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటంలేదు. ఇసుక తక్కువ ధరకు నాణ్యమైన ఇసుకను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం టీజీఎండీసీ ద్వారా ఖమ్మం నగరంలో టీజీఎండీసీ ఇసుక డిపోను ప్రారంభించింది. కానీ అప్పటి టీజీఎండీసీ అధికారులు, కొందరు ఇసుక వ్యాపారుల కారణంగా ఇసుక డిపో పట్టమని మూడునెలలు కూడా నడవలేదు.

అధిక ధరే కారణం

ఇసుక డిపోలో ధరను బహిరంగ మార్కెట్ కంటే అధికంగా తీసుకోవటంతో కొనేందుకు ఎవరు ముందుకు రాలేదు. దీంతో డిపో మూత పడటంతో ఇసుక అక్రమార్కులు వారి సొంత డిపోలను ప్రారంభించి అధికధరలకు అమ్మటం ప్రారంభించారు. వాస్తవానికి తెలంగాణాలో ఎక్కడైనా టీజీఎండీసీ ద్వారానే ఇసుకను కొనుగోలుచేసి అమ్మాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఇసుక డిపోలో అధిక రేటుకు కొన్న ప్రైవేటు వ్యక్తులు అదే ఇసుక తక్కువ ధరకు అమ్ముతున్నారు.

బహిరంగ మార్కెట్ కంటే అధికంగా రేట్లు

ఇసుక కొరతను అధిగమించేందుకు జిల్లాలో 2018డిసెంబరు 31న ఖమ్మం గ్రామీణ ప్రాంతం పోలేపల్లి సమీపంలో ఇసుక డిపో ఏర్పాటు చేశారు. సొంతంగా ఇల్లు నిర్మించుకునే వారు, జిల్లాలోని బిల్డర్లు ఇసుక డిపో ఏర్పాటు చేయడంతో కొంత అవసరానికి తగ్గట్లు ఇసుక దొరుకుతుందని ఆనందించారు. కానీ ఇసుక డిపో ప్రారంభమైన నాటినుంచి ఏనాడు కూడా ఏడాదిలో రెండు నుంచి మూడు నెలలు తీసి ఉన్న దాఖలాలు లేవు. ఈ విషయంపై టీఎస్‌ఎండీసీ అధికారులను ఎన్నిసార్లు అడిగినా.. కుంటిసాకులు చెబుతూ ఇసుక డిపో మూసివేస్తున్నారు. అనంతరం 2020నవంబరులో నగరంలోని నూతన బస్టాండ్ పక్కకు మార్చారు. కొన్నినెలల అనంతరం డిపోను మూసివేశారు. డిపోలో ఇసుక డిపో క్యూబిక్ మీటరు రూ.2100 ఉండేది. దీనికి జీఎస్టీ అదనం. ఒక్కోట్రాక్టర్కు(మూడు క్యూబిక్ మీటర్లకు)రూ.6700 చెల్లించాలి. ఒక్కో క్యూబిక్ మీటరులో 1.5టన్నుఇసుక ఉంటుంది. ట్రాక్టర్లో మూడు క్యూబిక్ మీటర్లు అంటే 4.5టన్నుల రేటు రూ.6750 ఉంటుంది. దీనికి ట్రాక్టర్ కిరాయితో కలిపి రూ.7500 వరకు విక్రయించేవారు. అయితే బహిరంగ మార్కెట్లో టన్ను ఇసుక రూ.1050నుంచి రూ.1100 వరకు మాత్రమే లభిస్తోంది. ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలకే దొరుకుతుంది.

వర్షాకాలంలో డిమాండ్ అధికం

వర్షాకాలం నదులు, వాగులు పొంగి ఇసుక లభించటం కష్టంగా మారుతుంది.ఎండాకాలం టీజీఎండీసీ ఇసుక డిపోల్లో ఇసుకను ముందుగానే డంప్ చేసి తక్కువ ధరకు ఇంటి నిర్మాణదారులకు అందిచాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయటం లేదు. సాధారణంగా ఇళ్ల నిర్మాణదారులు ఇసుకను తమకు చౌకగా సరఫరా చేసే ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు. అయితే వర్షాకాలంలో మాత్రం ఇసుకను ప్రైవేటు వ్యక్తులు మాత్రం విక్రయించేందుకు ముందుకు రారు. అయితే ప్రస్తుత మూడేళ్లగా ఇసుక డిపో మూసి ఉండటంతో ఇసుక లభించడం లేదు. గతంలో కూడా ఇసుక డిపోలోని ఇసుకను వర్షాకాలంలో తప్పా మిగిలిన కాలాల్లో పెద్దగా అమ్మిన దాఖలాలు లేవు.

జోరుగా ఇసుక వ్యాపారం

జిల్లా కేంద్రంలో ఇసుక వ్యాపారం జోరుగా నడుస్తోంది. రోజుకువందల సంఖ్యలో ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. నగరంలోని బైపాస్‌రోడ్డ ప్రాంతంలో, కరుణగిరి, ఇల్లెందు రోడ్డు ప్రాంతంలో బహిరంగ ప్రదేశాల్లో అనధికారిక ఇసుక డిపోలను ఏర్పాటు చేశారు. వ్యాపారులు ఒక్కో లారీలో 10నుంచి 45టన్నుల ఇసుకను రవాణా చేస్తున్నారు. ఇసుక క్వారీలకు అనుమతి లేకున్నా అక్రమ ఇసుక క్వారీయింగు దళారులు తెరలేపుతున్నారు. చీకటి సమయంలో,అర్ధరాత్రి తెగబడుతున్నారు. జిల్లాలోని చిన్నమండువ, పెద్దమండువ, చింతకాని, బోనకల్, వైరా పాలేరు. ఖమ్మం మున్నేరు తదితర ప్రాంతాల్లో అర్ధరాత్రి ఇసుకకు తవ్వుతున్నారు. చీకటిలో కూలీల సాయంతో ట్రాక్టర్లలతో లోడింగ్ చేస్తున్నారు. వాగులు,వంకలు, నదిగర్భాలను తవ్వుతున్నారు. జిల్లాలో మైనింగ్, రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించకపోవటంతో ఇసుక అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యాపారాలు సాగిస్తున్నారనే వాదనలు వినపడుతున్నాయి. అధిక రేట్లతో లబ్ధిదారులను దోచుకుంటున్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ వేడుకలు

ఖమ్మంమామిళ్లగూడెం,మార్చి28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు పార్లమెంట్ కమిటీ నాయకులు కేతినేని హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు పార్లమెంట్ కమిటీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాధం చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించి అనంతరం ర్యాలీగా ఎన్టీఆర్ సర్కిల్‌కు వెళ్లి అన్న నందమూరి విగ్రహానికి నివాళులు అర్పించనున్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబురాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రత్యేక కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి సీనియర్ నాయకులను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత పార్టీ కార్యాలయంలో అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమాన్ని అన్ని మండల కేంద్రాల్లో పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, పార్లమెంట్ కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

ప్రజానాట్య మండలి డివిజన్ కమిటీ

ఖమ్మంరూరల్,మార్చి28(ఆంధ్రజ్యోతి): ప్రజానాట్యమండలి పాలేరు డివిజన్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో 17మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షకార్యదర్శిగా మారుతీ కొండల్‌రావు, నందిగామ కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి వేముల సదానంద్ ఈకార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు నామాల లక్ష్మీనారాయణ, డివిజన్ ఇన్‌చార్జ్ నంద్రా ప్రసాద్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, సుదర్శన్ రెడ్డి, సుమతి పాల్గొన్నారు.

ఉద్యాన సిబ్బందికి ఘన సన్మానం

ఖమ్మంవ్యవసాయం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖలో పని చేసిన వివిధ సెక్షన్ల సిబ్బందిని శుక్రవారం సన్మానించారు. జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్ వీరిని సన్మానించారు. అద్భుతంగా పని చేసినందున, సకాలంలో పథకాలు పూర్తి చేసినందున, రాబోవు అదే సంవత్సరంలో కూడా ఇదేస్ఫూర్తితో పని చేయాలని రైతులకు సేవ చేయాలని కోరారు. పట్టు పరిశ్రమ డీడీ ముత్యాలు, ఉద్యాన అధికారులు, సూపరింటెండెంట్ విజయ్ కుమార్, సిబ్బంది గురు నారాయణ ఖలీల్ పాషా, సిలార్, జహీర్‌ను ఆయన సన్మానించారు



సిబ్బందిని సన్మానిస్తున్న మధుసూదన్

పంచాంగాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర స్థంభాద్రి పురోహిత సంఘం ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర నూతన పంచాంగాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. శుక్రవారం నగరంలోని పీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో సంఘం అధ్యక్షుడు ప్రసాద్ శర్మ, కార్యదర్శి సాయినాథ్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పేదపురోహితులను ప్రభుత్వ పరంగా అన్నిరకాలుగా ఆదుకుంటామన్నారు. మీ ఆశీర్వాద బలంతో ప్రభుత్వం ఇంకా పటిష్టంగా పాలన సాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సాధురమేష్‌రెడ్డి, కమర్తపు మురళీ, పాకాటి విజయనిర్మల, సైదాబాబు, ప్రసన్నకృష్ణ, బ్రహ్మణ నాయకులు రాజశేఖర వర్మ, రామ్మోహన్‌శర్మ,శ్రీధర్ శర్మ పాల్గొన్నారు.



రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద ముస్లిం, క్రైస్తవ, సిక్కులు, బౌద్దులు, జైనులు, పార్శికులానికి చెందిన నిరుద్యోగ యువత ఏప్రిల్ 5లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లామైనారిటీ సంక్షేమశాఖ అధికారి బి.పురంధర్ శుక్రవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9704003002 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

టీడీపీ కార్యాలయం కబ్జాకు యత్నం

» గువ్వలగూడెంలో నిర్మాణంలో ఉండగా దొంగఆధారాలు
» అడ్డుకున్న టీడీపీ నాయకులు



గువ్వలగూడెంలో కార్యాలయం వద్ద తెలుగుదేశం నాయకులు

నేలకొండ పల్లి,మార్చి28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గువ్వలగూడెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న టీడీపీ కార్యాలయాన్ని కబ్జా చేసేందుకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు యత్నించాడు. దీన్ని టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. నామా నాగేశ్వరరావు తెలుగుదేశం ఎంపీగా ఉన్న సమయంలో పార్టీ కార్యాలయం నిర్మాణానికి పూనుకున్నారు. అనివార్య కారణాల వలన కార్యాలయ నిర్మాణం లెంటల్ లెవల్‌లో నిలిచిపోయింది. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో గ్రామానికే చెందిన టీడీపీ నాయకుడు ఒకరు బీఆర్‌ఎస్‌లోకి మారారు. సదరు నాయకుడు దొంగ కాగితాలు సృష్టించాడు. ఆఫీస్ నిర్మించే స్థలం నాదని ఎదురు తిరిగాడు. అప్పట్లోనే తెలుగుదేశం కార్యకర్తలు నిర్మాణంలో ఆగిపోయిన కార్యాలయ భవనాన్ని స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చేయగా రాజకీయ వత్తిళ్లతో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై వివిధ రకాల కేసులు బనాయించారు. టీడీపీ కార్యకర్తలు ఇప్పటికీ కోర్టుకు తిరుగుతూనే ఉన్నారు. ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేసుకుంటుండగా, కబ్జాకు ప్రయత్నించిన సదరు నాయకుడు తిరిగి నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తిరిగి విచారణ చేపట్టారు. సదరు కబ్జాకు యత్నించిన నాయకుడు గతంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యదర్శి సహాయంతో టీడీపీ కార్యాలయం నిర్మాణంలో ఉన్న స్థలాన్ని తన పేరుపై ఎక్కించుకుని, ఇంటిపన్ను సైతం చెల్లిస్తున్నట్లు ఆధారాలు సృష్టించినట్లుగా తెలుస్తోంది. కానీ తెలుగుదేశం నాయకులు, గతంలో పార్టీ నిర్మాణానికి ఎవరెవరు విరాళాలిచ్చారు, కార్యాలయం కట్టిన కూలీలు, అప్పటి ఎంపీ నామా శంకుస్థాపన సాక్ష్యాలు సేకరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పార్టీ జెండా ఆవిష్కరణకు పోలీసులు టీడీపీ కార్యకర్తలకు చెప్పినట్లుగా తెలుస్తున్నది. టీడీపీ పాలేరు ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్, నాయకులు కోలేటి మస్తాన్‌రావు, వీసం శ్రీనివాసరావు, నలమాస మల్లయ్య, తీగ వెంకటేశ్వర్లు, గోగినేని పుల్లయ్య, పాలడుగు పూర్ణ, వేముల వెంకటేశ్వరరావు, ముప్పాళ్ళ రాజారావు,అమరనేని ప్రసాద్,కొలిక పంగు వెంకయ్య, మాతంగి రమేష్, యాలమూడి అనంతరామయ్య, నాగరాజు, గోగినేని ఉపేందర్ గుడిపల్లి నాగేశ్వరరావు బీఆర్‌ఎస్ నాయకుడి కబ్జాను అడ్డుకున్నారు.

దుస్తుల పంపిణీ



నేలకొండపల్లి, మార్చి28(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలకు శుక్రవారం దుస్తులను పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి యం.రాధ హమాలీలకు అందించారు. కార్యక్రమంలో ఛైర్మన్ సీతారాములు, కొడాలి గోవిందరావు, కార్యదర్శి నాగేశ్వరి, సూపర్‌వైజర్ భాస్కరరావు పాల్గొన్నారు.

పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోండి

» పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

నేలకొండపల్లి, మార్చి28(ఆంధ్రజ్యోతి): పోస్టల్ సంస్థ అందిస్తున్న బీమా సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కోరారు. మండ్రాజుపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చెవుల తిరుపతమ్మ బీమా సొమ్ము రూ.1,23,000, మృతురాలి భర్త శ్రీనుకు శుక్రవారం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అందించారు. పోస్టల్ బీమా అతి తక్కువ ప్రీమియం ఉంటుందని, ఎక్కువగా లాభాలుంటాయన్నారు. ప్రతీ ఒక్కరూ పోస్టల్ బీమాలో సభ్యులుగా చేరాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో పోస్టల్ ఎంఓలు లక్ష్మణ్‌రావు, నాగేశ్వరరావు, పోస్టుమాస్టర్ అజయ్ కుమార్, పోస్ట్‌మాన్ అనూష పాల్గొన్నారు.



నగదును అందచేస్తున్న శ్రీనివాస్

విన్‌ఫీల్డ్‌లో కల్చరల్ ఫెస్ట్ వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలలో శుక్రవారం కల్చరల్‌ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ హాజరై జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఫెస్టు హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలపండుగలు, వస్త్రధారణ, ఆహారపుపద్ధతులను తెలిపే స్టాల్స్ గిరిజన జాతరలు మెదలగు వాటిని ప్రదర్శించారు. సర్వమతసమానత్వం,మనదేశం విభిన్న సంస్కృతులకు ఆలవాలం అని అన్నారు.



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్లు పుల్లారావు, కిషోర్‌కుమార్, శ్రీకాంత్

రెజోనెన్స్‌ఇన్ఫో, త్రివేణిలో రంజాన్ వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి):నగరంలోని రెజోనెన్స్ ఇన్ఫో, త్రివేణి పాఠశాలల్లో శుక్రవారం రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ముస్లిం సంప్రదాయంలో ఉపవాస దీక్ష విరమణ, చిన్నారులు నమాజ్ చదవటం సంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యారు.





రెజోనెన్స్‌లో రంజాన్ వేడుకల్లో చిన్నారులు, త్రివేణి పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

'మత సామరస్యానికి ప్రతీక రంజాన్'

కూసుమంచి, మార్చి28(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా పెద్దసంఖ్యలో ముస్లింసోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, మసీద్ కమిటీ అధ్యక్షులు అహ్మదలి పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మైనార్టీలు ముఖ్యంగా ముస్లింల సంక్షేమం కోసం కాంగ్రెస్ పాటుపడుతున్నదని దయాకర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. షేక్.సుభాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం కోసం కాంగ్రెస్ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, ఎస్‌ఐ పెంటరి సంతోష్, నాయకులు నెల్లూరి భద్రయ్య, సీతరాములు,బొడ్డు బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, లక్కం ఏడుకొండలు, ముస్లిం నాయకులు యండి మహబూబ్‌అలీ, యండి. షాకీర్, షేక్.సోందు, షేక్.ఖాజామియా,షేక్.సుబాన్, రసూల్, రాయపూడి నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ముదిగొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముదిగొండకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు మౌలాలి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. శుక్రవారం మౌలాలి కుటుంబాన్ని పరామర్శించి కొందరు దాతలు ఇచ్చిన రూ.26వేల ఆర్థిక సహాయాన్ని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ మండల అధ్యక్షుడు ఈశ్వరాచారి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, షేక్.మైబు, వీరబాబు, ఇక్బాల్ పాల్గొన్నారు.

హితాన్ని బోధించే పండుగ రంజాన్

» కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్



రంజాన్ తోఫాను అందజేస్తున్న దయానంద్

సత్తుపల్లిరూరల్/ బోనకల్/ కారేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతలన కలయికే రంజాన్ మాసం ఇచ్చే గొప్ప సందేశమని, హితాన్ని బోధించే పండుగ రంజాన్ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కమల్‌మిత్రా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు రూ.2లక్షల విలువైన రంజాన్ తోఫాను 503 పేద ముస్లింలకు ఆయన చేతులమీదుగా పంపిణీ చేశారు. మహ్మద్ ప్రవక్త ద్వారా ఖురాన్ ఆవిర్భవించిన రంజాన్ మాసంలో నెల రోజుల పాటు ఎంతో నియమనిష్టలతో ముస్లింలు కఠిన ఉపవాస దీక్ష ఆచరించి అల్లాహ్ కృపకు పాత్రులవుతారన్నారు. కమల్ కుటుంబ సభ్యులు పదేళ్లుగా పేద ముస్లింలకు రంజాన్ తోఫా అందజేయడం అభినందనీయమని, ఆ కుటుంబానికి అల్లా ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, అలవాల కరుణాకర్, నిర్వాహకులు మహ్మద్ షాకీర్, మున్వర్, ఎండీ.కమల్‌పాషా, రహమత్‌పాషా, మాజీ కౌన్సిలర్ ఎండీ.రెహానాబేగం, ఆబీదాబేగం, రఫీ, మసీద్ సదర్ ముజ్జు రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ నగర్, మార్కెట్‌లోని మసీద్‌లలో ముస్లింలకు రోజా విడిపించి ఇఫ్తార్ విందును దయానంద్ అందజేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పర్వదినాన్ని అందరూ ఐకమత్యంతో జరుపుకోవడం సంతోషకరమని తహసీల్దార్ పున్నమ్ చందర్ తెలిపారు. బోనకల్ రైతు వేదిక కార్యాలయ ఆవరణలో శుక్రవారం రాత్రి ప్రభుత్వం ముస్లింలకు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఎస్ఐ మధుబాబు, ఎంఈవో దామాల పుల్లయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, సీపీఎం, టీడీపీ, సీపీఐ మండల నాయకులు కిలారు సురేష్, రావుట్ల సత్యనారాయణ, యంగల ఆనందరావులు పాల్గొన్నారు. ముస్లి ఐక్య సంఘ మండల నాయకులు షేక్ మహబూబ్ పాషా, దస్తగిరి, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి మండల కేంద్రంలో శనివారం ముస్లింలకు రాష్ట్రప్రభుత్వం ఇస్తున్న ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా వస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. ఇఫ్తార్ విందుకు జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పి. దుర్గాప్రసాద్, డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్నారని మండల పార్టీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ తెలిపారు.

ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్రం స్పష్టతనివ్వాలి

తల్లాడ, మార్చి28 (ఆంధ్రజ్యోతి): బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మద్దోజు శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం తల్లాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటై 12ఏళ్లు అవుతున్నా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ కోసం కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

» సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



నిరసన దీక్షలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

బోనకల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం బోనకల్ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు చింతలచెర్వు కోటేశ్వరరావు మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం జాప్యం చేయడం తగదన్నారు. రుణమాఫీ, రైతు భరోసా పథకాల అమలు కూడ పూర్తి స్థాయిలో జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కమిటీ సభ్యులు తెల్లాకుల శ్రీనివాసరావు, బంధం శ్రీను, మండల కార్యదర్శి కిలారు సురేష్, బిల్లా విశ్వనాథం, గుగులోతు నరేష్, ఉప్పర శ్రీను, గద్దె రామారావు పాల్గొన్నారు.

ఎంబీఏ పీజీ పట్టా అందుకున్న సుస్మిత



ఎస్‌బీఐ చైర్మన్ అరుంధతి భట్టాచార్య నుంచి పీజీ పట్టా అందుకుంటున్న సాయి సుస్మిత

వైరా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన రిలయన్స్ అనుబంధ సంస్థ ముంబై జీయో యూనివర్సిటీలో ఎంబీఏ డిజిటల్ మార్కెటింగ్ మీడియా కమ్యూనికేషన్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ విద్యను పూర్తిచేసిన వైరా విద్యార్థిని ఏపూరి సాయి సుస్మితకు ఎస్‌బీఐ చైర్మన్ అరుంధతి భట్టాచార్య పీజీ పట్టాను అందజేశారు. ముంబైలోని ఆ యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో పీజీ పట్టా అందుకున్న సాయి సుస్మితను పలువురు అభినందించారు. వైరాకు చెందిన ఏపూరి రాజారావు కుమార్తె అయిన సాయి సుస్మిత యూనివర్సిటీలో ఎంబీఏలో పీజీ పూర్తి చేయటం స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విజయ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



ఫరీద్‌మస్తాన్

కొణిజర్ల, మార్చి28(ఆంధ్రజ్యోతి): విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగానికి చెందిన సీనియర్ అధ్యాపకుడు పెంటేలా ఫరీద్‌మస్తాన్ అలియాస్ ఫరీద్‌బాబాకు డాక్టరేట్ లభించింది. ఫరీద్‌మస్తాన్ ఇంపాక్ట్ ఆఫ్ టెక్నాలజీ ఆన్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇన్ ది సెలెక్టెడ్ బ్యాంక్స్ ఇన్ తెలంగాణ స్టేట్స్ అనే అంశంపై యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రొఫెసర్ గోపి పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి ద్రవిడియన్ యూనివర్శిటీ కుప్పం డాక్టరేట్ ప్రకటించింది. డాక్టరేట్ రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఫరీద్‌మస్తాన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి ఫరీద్‌మస్తాన్‌ను అభినందించారు.

సీతారాముల కల్యాణానికి ఆహ్వానం



కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న దృశ్యం

ముదిగొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం ముత్తారం గ్రామస్థులు నవమి వేడుకలకు కలెక్టర్‌ను శుక్రవారం ఆహ్వానించారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా వచ్చేనెల 6వ తేదీన నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తుళ్లూరి జీవన్, నాయకుడు మల్లెల అజయ్ పాల్గొన్నారు.

బాధితులకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

» మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి



మాట్లాడుతున్న గోకినేపల్లి వెంకటేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో భవనం కూలి మృతిచెందిన కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియాతో పాటు ఉద్యోగాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సత్తుపల్లి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే గ్రామ పంచాయితీ ఈవోను సస్పెండ్ చేసి సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. భక్తి ముసుగులో రూ.కోట్లలో దండుకుంటున్న శ్రీపతి శ్రీనివాస్‌ను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా మునిసిపల్ కమీషనర్ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. దీంతో ఈరోజున ఆ మృతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కార్యక్రమంలో గంటా శ్రీను, అమర్లపూడి శరత్, తాటి రాజు, ఒగ్గు నాగిరెడ్డి, కొర్సా వెంకటేష్, దుంపా రాఘవులు, రెడ్డి వెంకటేష్, కుంటా కృష్ణ, అలివేలు, చిన్న భద్రం తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

వైరా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాలకు ఘన నివాళులర్పిస్తూ ఐక్య క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వైరాలో శాంతి ర్యాలీ నిర్వహించారు. వైరాలోని క్రాస్‌రోడ్డు నుంచి పాత బస్టాండ్, కాంగ్రెస్ కార్యాలయం మీదుగా తిరిగి మళ్లీ క్రాస్‌రోడ్డు వరకు కొవ్వొత్తులతో ఈ శాంతి ర్యాలీ చేశారు. క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన సంతాప సభలో ప్రవీణ్‌కు నివాళులర్పించారు. హిందూ, క్రైస్తవ, ముస్లిం మతసామరస్యం వర్థిల్లాలని నినాదాలు చేశారు. క్రైస్తవ సంఘాల నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆంబోతు మృతి... ఊరేగింపు

కొణిజర్ల,మార్చి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్ల గ్రామ ఆంబోతు శుక్రవారం మృతి చెందింది. హుషారుగా గ్రామంలో తిరిగే ఆంబోతు మొక్కజొన్నలు తినటం వల్లనో, వైరల్ ఫీవర్‌తోనో గాని అస్వస్థతకు గురై మృతి చెందింది. పశువైద్యాధికారి కూడా వైరల్‌ఫీవర్, మొక్కజొన్న కారణం కావచ్చని తెలిపారు. ఆంబోతు మృతితో గ్రామస్థులు చాలా మంది కన్నీరుపెట్టారు.

ముస్లింలకు అత్యంత పవిత్రమైనది ఈద్

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు అత్యంత పవిత్రమైనది రంజాన్ మాసమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వైరా మసీదులో నిర్వహించిన ఇఫ్తార్‌విందు కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. రంజాన్ విశిష్టతను వివరించారు. ముస్లింలతో కలిసి మసీదులో నమాజ్ చేశారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని అన్నారు. అనంతరం ఇఫ్తార్‌విందు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు కట్ల రంగారావు, సంతోష్, దొడ్డా పుల్లయ్య, రాంపూడి రోశయ్య, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, ధార్న రాజశేఖర్, చెరుకూరి కిరణ్, షేక్.అన్వర్, కోసూరి శ్రీను, పాలేటి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



మొక్కజొన్నలను పరిశీలిస్తున్న రైతుసంఘం ప్రతినిధులు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి

» తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యుద్ధప్రాతిపదికన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని విప్పలమడక, లింగన్నపాలెం గ్రామాల్లో పర్యటించి మొక్కజొన్న కల్లాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పదిరోజులుగా ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు మొక్కజొన్నలు కొనుగోలు చేస్తున్నారని దీని వలన రైతులు నష్టపోతున్నారని, వెంటనే ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. ఖమ్మం వెళ్లి అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి ఒక వినతిపత్రం సమర్పించారు. విప్పలమడక మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాయ్య, గరికపాడు సొసైటీ డైరెక్టర్ బాణాల కృష్ణమాచారి, రైతులు గరిడేపల్లి పుల్లారావు, చెరుకూరి కృష్ణారావు, చావా వెంకటేశ్వర్లు, ఇనపనూరి తిరుపతయ్య, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకురాలు
సీతమ్మ కన్నుమూత

» నివాళులు అర్పించిన నాయకులు పొన్నం, నున్నా



కొణిజర్ల, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు దొడ్డపునేని సీతమ్మ(85) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. పార్టీ అభివృద్ధి కోసం సీతమ్మ విశేషకృషిని అందించారు. ఆమె మరణం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె సేవలను నాయకులు కొనియాడారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను
వెంటనే నెరవేర్చాలి: సీపీఎం

ముదిగొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ముదిగొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆందోళన నిర్వహించారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి గోపాలరావు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలు పరిష్కరించకుండా మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ శ్రీలక్ష్మీకి వినతిపత్రం అందజేశారు.



నిరసన తెలుపుతున్న ముస్లింలు

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలి

ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు

మధిరటౌన్/ కొణిజర్ల, మార్చి28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మౌలాన షేక్ ముజాహిద్ పిలుపునిచ్చారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం మధిర లోని జామియా మసీదు నందు ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును ముస్లిం సమాజం ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోదని దీన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని ప్రభుత్వం బిల్లును ఉపసంహరించుకునే వరకు పోరాడతామని అన్నారు. ఈ కార్యక్రమలో సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్, నాయకులు రషీద్, సోందు, బాజీ, రబ్బాని, జమీర్, వలి, అజీముద్దీన్, బుడేన్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

కొణిజర్ల మండల పరిధిలోని తీగలబంజర గ్రామంలో గల మసీద్‌లో శుక్రవారం ముస్లిం మత పెద్దలు,కమిటీ సభ్యులు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నమాజ్ అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవ ఫ్లెక్సీ..

వైరా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవ ఫ్లెక్సీని ఆపార్టీ అభిమానులు ఏర్పాటుచేశారు. క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ ప్రధాన రహదారి పక్కన ఏర్పాటుచేసిన భారీ ఫ్లెక్సీ ఆకట్టుకుంటోంది. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్, జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, మాజీ మంత్రి దివంగత నందమూరి హరికృష్ణ ఫొటోలతో ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

» గోపవరం సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి సత్యనారాయణ

కొణిజర్ల,మార్చి28(ఆంధ్రజ్యోతి): కొణిజర్లలోని గోపవరం సొసైటీ అభివృద్ధికి కృషి చేద్దామని సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం కొణిజర్ల సొసైటీ కార్యాలయంలో 63వ మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అందరి సలహాలు సూచనలతో సొసైటీని అభివృద్ధి పథంలో ఉంచుదామని, అందుకు సభ్యులంతా సహకరించాలని కోరారు. రైతులకు అన్ని విధాలుగా సొసైటీ నుంచి సేవలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ నెల్లూరి రమేష్, సహకార శాఖ పర్యవేక్షణాధికారి అకీలాబేగం, సొసైటీ సభ్యులు రావుల వెంకయ్య, పాపగంటి సుదర్శనం, సంక్రాంతి నర్సయ్య, రాంపుడి సత్యనాగేంద్ర, కొమ్ము తిరుమలి, కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, సొసైటీ మాజీ చైర్మన్ పాసంగులపాటి శ్రీనివాసరావు, స్వర్ణ రమేష్, స్వర్ణ సుబ్బారావు, యర్రశ్రీను, యలమందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ వర్తింపజేయాలి

తల్లాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సొసైటీలో తమకు రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం తల్లాడ సొసైటీ కార్యాలయంలో చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన సొసైటీ మహాజన సభ జరిగింది. ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయశాఖ రుణమాఫీ జాబితాలో తమ పేర్లు ఉన్నప్పటికీ సొసైటీలో రుణమాఫీ వర్తించలేదని రైతులు వాపోయారు. తమకు తక్కువ రుణం ఇచ్చి ఎక్కువ బకాయి ఉన్నట్లు నోటీసులు ఇవ్వడం పట్ల రైతులు అభ్యంతరం తెలిపారు. చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బకాయిలు సకాలంలో చెల్లించని కారణంగా కొత్త రుణాలు మంజూరు కావడం లేదన్నారు. సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌కుమార్, సీఈవో నాగబాబు, వైస్‌చైర్మన్ కటికి నర్సింహారావు, డైరెక్టర్లు రేగళ్ల సత్యం, గోవిందు శ్రీనివాసరావు, వెంకటయ్య పాల్గొన్నారు


పీహెచ్‌సీలకు వీల్‌చైర్స్ పంపిణీ



ఆసుపత్రి సిబ్బందికి వీల్‌చైర్స్ అందజేస్తున్న సభ్యులు

ఏన్కూరు, మార్చి28(ఆంధ్రజ్యోతి): చేతన ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, రోగుల సౌకర్యంకోసం ఏన్కూరు, కొణిజర్ల మండలం పెద్దగోపతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వీల్‌చైర్లను శుక్రవారం పంపిణీచేశారు. చేతన ఫౌండేషన్ జాయింట్ సెక్రటరి దొడ్డ సీతారామయ్య మాట్లాడుతూ ఆసుపత్రులకు వచ్చే రోగుల కొరకు వినియోగించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వెనిగళ్ల అనిల్‌కుమార్, నిర్వాహకలు మాదినేని నరసింహారావు, ముత్తినేని సురేష్, అంగోతు బాప్సన్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, ఆసుపత్రి పీహెచ్‌సీ వైద్యులు రాధాకృష్ణ, రాములు, ల్యాబ్ టెక్నీషియన్ ఉప్పెర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల వితరణ



వీధి దీపాలు అందజేస్తున్న టోని

కారేపల్లి, మార్చి28(ఆంధ్రజ్యోతి: మండల కేంద్రంలోని సింగరేణి గ్రామపంచాయతీలో నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలకు అమర్చేందుకు అవసరమైన వీధిలైట్లను మండల కాంగ్రెస్ నాయకుడు మేదరి టోని శుక్రవారం అందజేశారు. రూ.11వేల విలువగల సామగ్రిని అందజేసినట్లు టోని తెలిపారు. కులమతాలకు అతీతంగా అవసరమైనచోట ఆర్థిక సహాయం అందించడంలో ముందుంటానని తెలిపారు.